క్లుప్తంగా

ఆహారం పంపిణీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మానసిక రుగ్మతలతో బాధపడుతున్న అనాథలైన యువకులకు విశ్వబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఫౌండేషన్ అధ్యక్షుడు శీలం తిరుపయ్య భోజనం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫౌండేషన్ ప్రారంభించిన సందర్భంగా నెల్లూరు ప్రగతి చారిటీస్ సంస్థలో ఉన్న సుమారు 150 మందికి ఆహార పదార్థాలు, తినుబండారాలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యుడు జె.రామచంద్రయ్య, కన్వీనర్లు చందన్‌కుమార్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

అభిషేకం, గిరిప్రదక్షిణ ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండపై వెలసిన శ్రీవేదగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో పౌర్ణమి సందర్భంగా స్వామివారి ఉత్సవమూర్తికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు, గిరిప్రదక్షిణ ఉత్సవం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు నెల్లూరుకు చెందిన గిరీష్‌కుమార్ కుటుంబసభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమాల్లో కార్యనిర్వహణాధికారి వి.గిరికృష్ణ, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత



నెల్లూరు(బృందావనం): నగరంలోని రంగనాయకులపేట బర్మాషెల్‌గుంట వద్ద జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు విశ్వమాత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుస్తులు, పండ్లు, బిస్కెట్లు శనివారం అందజేసినట్లు ఫౌండేషన్ నిర్వాహకురాలు దూబిశెట్టి కల్యాణి తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు హుస్సేన్, సుభాషిణి, చరిత, ధనలక్ష్మి, రాము, లక్ష్మి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ఆరా



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని 14వ డివిజన్‌లో ఆ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి శనివారం పర్యటించారు. డివిజన్‌లోని ద్వారకామాయినగర్, శ్రీనగర్, ఏసీనగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

వెంకయ్యస్వామికి ప్రత్యేక పూజలు



మనుబోలు: మనుబోలు–చెర్లోపల్లి మార్గంలో ఉన్న భగవాన్ వెంకయ్యస్వామి ఆలయంలో స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు శ్రీనివాసులు స్వామివారికి పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద హోమగుండం వేసి ధునిపూజ చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి గంధళ్ల కృష్ణయ్య – అన్నపూర్ణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

పరిశుభ్రతకు పాతర



రామాలయం సమీపంలో రోడ్డుపై చెత్తకుప్పలు



చెత్తకుప్పల్లో ఆహారాన్ని వెతుక్కుంటున్న గేదెలు

- రోడ్డుపై పేరుకుపోతున్న చెత్తకుప్పలు
- వారమైనా తొలగించని వైనం
- వ్యాధులు ప్రబలే అవకాశం

నెల్లూరు(బారకాసు): సింహపురి స్వచ్ఛత దిశగా అడుగులు వేయాల్సిన నగరపాలక సంస్థ పారిశుద్ధ్యం మెరుగుపై అంతగా శ్రద్ధ కనబరచడం లేదు. నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. వారం రోజులు గడచినా చెత్తను తొలగించే విషయంలో నిర్లక్ష్యం కనబరుస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫలితంగా ఎక్కడ అంటురోగాలు వ్యాప్తి చెందుతాయోనన్న భయాందోళనలు నగర ప్రజల్లో నెలకొంది.

వారం రోజులు గడుస్తున్నా..

నెల్లూరు నగరంలోని హరనాథపురం, రామాలయం సమీపంలో రెండో వీధిలో రోడ్డుపై చెత్తకుప్పలు పేరుకుపోయాయి. వారం రోజులు గడుస్తున్నా చెత్తను తొలగించేలా చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏరోజుకారోజు చెత్తను తొలగించాల్సి ఉండగా ఆ దిశగా పారిశుద్ధ్య సిబ్బంది చర్యలు చేపట్టడం లేదని స్థానికులు వాపోతున్నారు. చెత్తకుప్పలు నిల్వ చేరడంతో గాలులు వీస్తున్న సమయంలో అక్కడి చెత్త ఇళ్లల్లోకి చేరడమే కాకుండా కుక్కలు, ఆవులు, పందులు చెత్తని చెల్లాచెదురుగా చేస్తుండడంతో అపరిశుభ్రత నెలకొంటోంది. మరోవైపు చెత్తను తొలగించకపోవడంతో తామెక్కడ అంటురోగాల బారిన పడతామోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి చెత్తకుప్పలను తొలగించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ధరలు పెరగకుండా చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న జేసీ సేతు మాధవన్

- జేసీ సేతు మాధవన్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో ఉల్లిపాయలు, టమాటాల ధరలు పెరగకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో జిల్లా ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశం జేసీ అధ్యక్షతన నిర్వహించారు. ఎండలకు టమాటాలు, ఉల్లిపాయలతో పాటు ఇతర కూరగాయల దిగుబడులు గణనీయంగా తగ్గాయని, దీంతో ధరలు పెరిగాయని అధికారులు జేసీకి వివరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ టమాటాలు, ఉల్లిపాయల ధరల స్థిరీకరణకు చర్యలు తీసుకోవాలని, అవసరమైతే పొరుగు జిల్లాల నుంచి సేకరించి రైతుబజార్ల ద్వారా వినియోగదారులకు విక్రయించాలని సూచించారు. మార్కెటింగ్, పౌరసరఫరాలు, తూనికలు కొలతలు, ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారులతో ఏర్పాటైన విజిలెన్స్ కమిటీ ద్వారా వ్యాపారులు దుకాణాలు, గోదాముల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించాలన్నారు. ఎవరైనా అవసరానికి మించి ఎక్కువ నిల్వ చేసి అధిక ధరలకు విక్రయించినట్లు గుర్తిస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో మార్కెటింగ్ శాఖ ఏడీ అనితకుమారి, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటరమణ, తూనికలు, కొలతల డీసీ ఇసాక్, రైతుబజార్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజల సేవలో 107 సంవత్సరాలు



మాట్లాడుతున్న బ్యాంక్ చైర్మన్ అరిగెల నాగేంద్రసాయి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): 'ది నెల్లూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్' నెల్లూరు నగర ప్రజలకు 107 సంవత్సరాలుగా ఆర్థిక సేవలు అందిస్తూ మన్ననలు పొందుతోందని ఆ బ్యాంకు చైర్మన్ అరిగెల నాగేంద్రసాయి అన్నారు. నగరంలోని టౌన్‌హాలులో శనివారం బ్యాంకు 108వ మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేంద్రసాయి మాట్లాడుతూ గత 107 సంవత్సరాలుగా నెల్లూరు నగర పేద, మధ్య తరగతి ప్రజల అవసరాలకు తక్కువ వడ్డీతో రుణాలిస్తూ అర్బన్ బ్యాంకు నగర ప్రజల మన్ననలు పొందుతోందన్నారు. అనంతరం 10వ తరగతిలో 500 మార్కులు పైన సాధించి బ్యాంకు సభ్యుల పిల్లలు ఆరుగురికి రూ.5 వేల ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. తదనంతరం బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలకు సంబంధించిన ఈఎంఐలను క్రమం తప్పకుండా చెల్లిస్తున్న 20 మంది ఖాతాదారులను సన్మానించారు. కార్యక్రమంలో బ్యాంక్ వైస్ చైర్మన్ శ్రీనాథ్, డైరెక్టర్లు వినోదిని, మహేశ్వరి, జయకోటేశ్వరరావు, ప్రభాకర్‌రెడ్డి, అమర్‌ఖాసిం, నాగలక్ష్మి, లతీఫ్ అహ్మద్, శ్రీనివాసమూర్తి, జీవన్‌శేఖర్‌రెడ్డి, బ్యాంకు సీఈఓ అనిత, షఫీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాల విద్యార్థుల ర్యాలీ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా శనివారం నగరంలోని 54వ డివిజన్ జనార్దనరెడ్డికాలనీలోని ఉర్దూ పాఠశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. పిల్లలందరూ బడికి వెళ్లి చదువుకోవాలనే లక్ష్యంతో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించినట్లు ఉర్దూ డీఈఈ ఖాజామొహిద్దీన్ అన్నారు. కార్యక్రమంలో ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం, కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి (సీఎంఓ) పెంచలయ్య, ఏపీఓ ప్రసాద్, ఐటీడీఏ సిబ్బంది శాంతకుమారి, ఉర్దూ పాఠశాల హెచ్‌ఎం సందానీబాషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేసిన వీసీ తదితరులు

నెల్లూరు(టౌన్): విద్యార్థి దశలో బాగా చదువుకుంటే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉప కులపతి జీఎం సుందరవల్లి తెలిపారు. స్థానిక కొండాయపాళెంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఏర్పాటై 105 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆ పాఠశాలలో సంబరాలు నిర్వహించారు. తొలుత అంబేడ్కర్, జ్యోతిరావుపూలే చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పిల్లల్లో మానసిక, వ్యక్తిత్వ వికాసం పెంపొందేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందించిన దాతలను అభినందించారు. అనంతరం నవోదయ విద్యాలయం, వీపీఆర్‌లో సీట్లు పొందిన ఆరుగురు విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో ఐఆర్ఎస్ అధికారి ఉషాకిరణ్, సమగ్ర శిక్ష ఏఎంఓ సుధీర్‌బాబు, డిప్యూటీ ఈఓ ప్రసన్నలక్ష్మి, కార్పొరేటర్ మహేష్, డాక్టర్ సునీత, ఎంఈఓలు అబ్దుల్‌హమీద్, మురళీధర్, హెచ్‌ఎం భాస్కరరావు, బీటీఏ నాయకులు వేణుగోపాల్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మహావిష్ణువు ఉత్సవాలు



విద్యుద్దీపాలంకరణలో శ్రీగురువాయూర్ మహావిష్ణు ఆలయం

- 27 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని వేదాయపాళెంలో ఉన్న శ్రీస్వామి అయ్యప్ప దేవస్థానం ప్రాంగణంలో ఉన్న శ్రీమహాలక్ష్మీ గోదా సమేత శ్రీగురువాయూర్ మహావిష్ణువు స్వామి ఆలయంలో ఆదివారం నుంచి ఈ నెల 26వ తేదీ వరకు పుష్కర మహాసంప్రోక్షణ కుంభాభిషేకం, 27వ తేదీ నుంచి జూలై 2వ తేదీ వరకు స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయని శ్రీస్వామి అయ్యప్ప సేవా సమాజం అధ్యక్షుడు గూడల శేషగిరిరావు శనివారం తెలిపారు. ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ జరిగి 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పుష్కర మహాసంప్రోక్షణ కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు అంకురార్పణ పూజలు జరుగుతాయన్నారు. సోమవారం హోమాలు, ద్వారతోరణ, మహాకుంభారాధన, శాత్తుమొరై తదితర పూజలు, మంగళవారం శ్రీమహాలక్ష్మి అమ్మవారికి స్నపన నవకలశ తిరుమంజనం, మహాకుంభ, చక్రాబ్జ, మండల ఆరాధన, హోమాలు, పూర్ణాహుతి, మహానివేదన, బుధవారం మహాకుంభప్రోక్షణ, ఊంజల్‌సేవ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

27 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

శ్రీమహాలక్ష్మీ గోదా సమేత శ్రీగురువాయూర్ మహావిష్ణువు దేవస్థానంలో ఈ నెల 27 నుంచి జూలై 2వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయని శేషగిరిరావు తెలిపారు. ఈ నెల 27వ తేదీన అంకురార్పణ పూజలు, 28న అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం, మహాకుంభారాధన, శేషవాహన సేవ, 29న శ్రీమహాలక్ష్మి అమ్మవారికి అభిషేకం, లక్ష్మీయాగం, లక్ష్మీగాయత్రి హోమాలు, మహాకుంభారాధన, హనుమంతసేవ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 30న ఉత్సవర్లకు అభిషేకం, ధన్వంతరి అష్టాక్షరి హోమాలు, మహాకుంభారాధన, గరుడసేవ, జూలై ఒకటో తేదీ మహాకుంభారాధన, హోమం, స్వామివారికి తిరు కల్యాణ మహోత్సవం, మహాకుంభారాధన, జూలై 2వ తేదీ హయగ్రీవ హోమం, స్వామివారికి నవకలశ స్నపన తిరుమంజనం, చక్రస్నానం, ద్వాదశ ఆరాధన, హోమాలు, శ్రీపుష్పయాగం, ధ్వజావరోహణం, మహాకుంభప్రోక్షణ, ఏకాంతసేవ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని డైకస్‌రోడ్డు 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కలెక్టరేట్, వైఎంసీఏ, జెడ్పీ విద్యుత్ ఫీడర్లలో మరమ్మతులు, విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలను తొలగించే కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని నెల్లూరు టౌన్ విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని వాహబ్‌పేట, ఆచారివీధి, కలెక్టరేట్, మద్యపతివారివీధి పరిసర ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

యోగా సాధనతో ఆరోగ్యం



యోగా గురువులు నజీర్‌బాషా, రవీంద్రలను సన్మానిస్తున్న నిర్వాహకులు

నెల్లూర(బృందావనం): యోగా ద్వారా ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఆత్మస్థైర్యం ఒనగూరుతాయని జిల్లా పీహెచ్‌సీ అసోసియేషన్ అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ తెలిపారు. నగరంలోని మూలాపేటలో ఉన్న సత్యసాయి ధ్యానమందిరంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యోగా, ధ్యానం మన జీవన విధానంలో ఒక భాగం కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా యోగా గురువులు నజీర్‌బాషా, ముత్యాల రవీంద్రలను కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా పీహెచ్‌సీ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్, పీహెచ్‌సీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శేషయ్య, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నన్ను అంతం చేసేందుకు కుట్ర



మాట్లాడుతున్న నిజాముద్దీన్

నెల్లూరు సిటీ: తనను అంతం చేసేందుకు కుట్ర చేస్తున్నారని, తనకు ఏమైనా జరిగితే రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కారణమని నెల్లూరు రూరల్ సోషల్ మీడియా కన్వీనర్ నిజాముద్దీన్ పేర్కొన్నారు. తనను అంతం చేసేందుకు కుట్ర చేస్తున్నారంటూ ఆయన శనివారం సోషల్ మీడియా ద్వారా వీడియో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నేను నీకు తెలియదా.. నన్ను చంపడానికి మనుషులను పంపిస్తావా అంటూ ప్రశ్నించారు. కొందరు అసభ్య పదజాలంతో దూషిస్తూ ఇంటిపై దాడి చేశారన్నారు. తనపై లేనిపోని ఆరోపణలు చేసి మనుషులను పంపిస్తున్నారని మండిపడ్డారు. ఎస్పీ స్పందించి తనకు రక్షణ కల్పించాలని కోరారు. తనకు ఏమైనా జరిగితే అందుకు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డే కారణమన్నారు. ఈ విషయంపై హోం మినిస్టర్ అనిత, డీజీపీ తిరుమలరావును కలిసి ఫిర్యాదు చేస్తానన్నారు.

కళాకారులను ప్రోత్సహించాలి



నెల్లూరు(బృందావనం): సమాజానికి యువత స్ఫూర్తిదాయకం కావాలని, కళాకారులను ప్రోత్సహించాలని అభినవ ఘంటసాల బిరుదాంకితుడు, సీనియర్ గాయకుడు పాటూరు శ్రీనివాసులు తెలిపారు. నగరంలోని నర్తకిసెంటర్‌లో శనివారం రాత్రి మురళీ ఆర్ట్స్ ఆధ్వర్యంలో కళాకారుడిగా విభిన్న రంగాల్లో రాణిస్తున్న నగరానికి చెందిన కె.వంశీని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పాటూరు శ్రీనివాసులు మాట్లాడుతూ కళారంగానికి నెల్లూరు చిరునామా అని, ఎందరో కళాకారులకు సింహపురి పుట్టినిల్లన్నారు. ప్రతిభ గల కళాకారులను గుర్తించి వారిని ప్రోత్సహిస్తూ మురళీ ఆర్ట్స్ అధినేత శింగంశెట్టి మురళీమోహన్‌రావు, కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు ఆధ్వర్యంలో వంశీని అభినందించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో వివిధ సంస్థల నిర్వాహకులు, కళాకారులు శీనయ్య, జనార్దన్, ప్రసాద్‌బాబు, అబ్దుల్, మహేష్, షఫీ, సాయికృష్ణ, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు తక్షణమే పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎస్ఈ విజయన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ విద్యుత్ అధికారులను ఆదేశించారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో శనివారం జిల్లాకు చెందిన విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో విద్యుత్ లైన్లలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. విద్యుత్ బిల్లుల బకాయిలపై దృష్టి సారించాలని, విద్యుత్ వృథాను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (టెక్నికల్) శేషాద్రిబాలచంద్ర తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): ఫ్యానుకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై శనివారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. రాజస్థాన్‌కు చెందిన లక్ష్మణ్‌లాల్(20) ఉపాధి నిమిత్తం కొన్నేళ్ల క్రితం నెల్లూరు నగరానికి వచ్చారు. టైల్స్ పనులు చేసుకుంటూ మాగుంటలేఅవుట్‌లో నివాసం ఉంటున్నారు. ఇటీవల వివాహమైంది. అయితే ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ శుక్రవారం తానుంటున్న గదిలోనే ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న దర్గామిట్ట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు శనివారం రాత్రి నెల్లూరుకు చేరుకుని లక్ష్మణ్‌లాల్ మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మోసగించారని ఫిర్యాదు

నెల్లూరు(క్రైమ్): నెల్లూరులోని 37వ డివిజన్‌కు చెందిన జగ్గారావు, నవాబుపేటకు చెందిన అవినాష్‌లు తమకు సబ్‌స్టేషన్‌లో లైన్‌మెన్ ఉద్యోగాలు ఇప్పిస్తానని నగరానికి చెందిన శ్రీనివాసయాదవ్ అనే వ్యక్తి మోసగించాడని శనివారం దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారిస్తున్నారు.